

దర్జాగా బుసక దందా!

అతను ఓ బీసీ నాయకుడు. వైసీపీ తరఫున తోట్లవల్లూరు పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేయాలని తలంచాడు. ఆ పార్టీలో క్రియాశీలకంగా పని చేశాడు. తీరా సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వు కావటంతో సర్పంచ్‌గా పోటీ చేయలేకపోయాడు. వైసీపీ మూలాలు ఉన్న సదరు వ్యక్తి తోట్లవల్లూరు మండలంలో రొయ్యూరులో అక్రమంగా బుసక క్వారీ నడపటం, స్థానిక టీడీపీ నాయకులు అతనికి మద్దతుగా నిలవటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే వైసీపీ నాయకుడి అక్రమంగా బుసక క్వారీ ఏర్పాటుకు సీఎంవోలోని ఓ ప్రముఖ వ్యక్తి అండదండగా నిలిచినట్టు ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వంలో వైసీపీ నాయకుడు ఇంత ధైర్యంగా అక్రమంగా బుసక క్వారీ నిర్వహించటంపై అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు.



రొయ్యూరులో అక్రమంగా నడుస్తున్న బుసక క్వారీలో ఎక్స్‌కవేటర్

కృష్ణానదీపాయలో వైసీపీ నాయకుడి నిర్వాకం

- సీఎంవోలోని ప్రముఖ వ్యక్తి నుంచి అండదండలు!
- మద్దతుగా నిలుస్తున్న స్థానిక టీడీపీ నాయకులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- బుసక లారీలను పోలీసులు పట్టుకోవడంతో విషయం వెలుగులోకి..

తోట్లవల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు మండలం రొయ్యూరు రెవెన్యూ పరిధిలోని కృష్ణానదీపాయలో వైసీపీ నాయకుడు ఒకరు అనధికార బుసక క్వారీ నిర్వహిస్తున్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వల్లూరుపాలెం పాతర్యాంపు నుంచి కృష్ణానదీపాయలో రొయ్యూరు వైపుకు కిలోమీటరు పొడవున బాట నిర్మించి, అక్రమ బుసక క్వారీ ఏర్పాటు చేశారు. ఈ బాట నిర్మాణ సమయంలో తోట్లవల్లూరుకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు ఆ వైసీపీ నాయకుడికి మద్దతుగా నిలబడ్డారని విమర్శలు వస్తున్నాయి. రైతుల నుంచి 3.30 ఎకరాల పట్టాభూమి తీసుకుని బుసక తవ్వకాలు చేపట్టారు. బుధవారం రాత్రి అక్రమంగా తరలి వెళ్తున్న బుసక లారీలను పోలీసులు నిలువరించటంతో వ్యవహారం బయటకువచ్చింది. ఈ విషయమై వల్లూరుపాలెం గ్రామస్తులు విలేకరులకు సమాచారం అందించారు. గురువారం ఈ అక్రమ బుసక క్వారీ వద్దకు మీడియా



కిలో మీటరు పొడవున నిర్మించిన బాట

వెళ్లగా ఎక్స్‌కవేటర్ ఖాళీగా నిలిపి ఉంది. పోలీసుల హెచ్చరికతో తవ్వకాలను తాత్కాలికంగా ఆపారని తెలిసింది. అక్కడ సుమారు 30 సెంట్లలో అక్రమంగా బుసక తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఎక్కువగా బుసక తవ్వకాలు చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇసుక లారీల మాటున అక్రమంగా బుసక లారీలను నడుపుతున్నారని సమాచారం.

క్వారీకి అనుమతి లేదు : తహసీల్దార్

రొయ్యూరు బుసక క్వారీపై తహసీల్దార్ ఎం.కుసుమ కుమారిని వివరణ కోరగా, బుసక క్వారీకి అనుమతి లేదని చెప్పారు. తాము ఎవ్వరికి అనుమతి ఇవ్వలేదన్నారు. తమకు ఈరోజే తెలిసిందని, సిబ్బందిని పంపి బుసక తవ్వకాలను ఆపివేయిస్తామని వివరించారు.

సీఎంవోలో ఎవరా వ్యక్తి?

రొయ్యూరులో వైసీపీ నాయకుడు అక్రమంగా బుసక క్వారీ నడపటం వెనుక సీఎంవోలో పనిచేస్తున్న ఓ వ్యక్తి అండగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. సీఎంవోలోని వ్యక్తి జోక్యం ఉండటం వల్లే వైసీపీ నాయకుడు ధైర్యంగా బాట నిర్మించి మిగతా 6లో..

విద్యుత్‌శాఖ ఉద్యోగి నయా మోసం

- చేపలు, రొయ్యల చెరువుల విద్యుత్ మీటర్లు ఇంటి వద్ద పెట్టుకుని నామమాత్రపు బిల్లులు జారీ
- నాలుగేళ్లుగా వ్యవహారం.. రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి



విద్యుత్ ఉద్యోగి ఉదయభాను

- విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారుల దాడుల్లో బట్టబయలు
- సదరు ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ

చేపలు, రొయ్యల చెరువులు, గృహాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో జూనియర్ లైన్‌మెన్ స్థాయి ఉద్యోగి ఒకరు పైఅధికారులనే బురిడీ కొట్టించాడు. విద్యుత్‌శాఖ ఆదాయానికి నాలుగేళ్లుగా భారీ మొత్తంలో గండి కొట్టి, తన జేబు నింపు కున్నాడు. ఇటీవల విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు జరిపిన తనిఖీల్లో ఈ విషయం వెలుగుచూసింది. దీనిపై తీవ్రంగా స్పందించిన ఆశాఖ ఉన్నతాధికారులు సదరు జూనియర్ లైన్‌మేన్ చిప్పల ఉదయభానును సస్పెండ్ చేశారు. లోతైన విచారణకు ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం మండలం రుద్రవరం సచివాలయం ఉద్యోగి చిప్పల ఉదయభానును విద్యుత్‌శాఖలో సిబ్బంది కొరత ఉండటంతో నాలుగేళ్ల కిందట జూనియర్ లైన్‌మేన్‌గా అధికారులు తీసుకున్నారు. రుద్రవరం, పరిసర ప్రాంతాల్లో ఇంటి అవసరాలకు విద్యుత్ మీటర్లు అందజేయడం, రొయ్యలు, చేపల చెరువులకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడం, నెలనెలా చెరువుల వద్ద విద్యుత్ రీడింగ్ తీయడం వంటి పనులను ఉదయభానుకు అప్పగించారు. గతంలో విద్యుత్ పనులపై అవగాహన ఉన్న ఉదయభాను ఇదే అవకాశంగా తీసుకుని రొయ్యల చెరువుల యజమానులతో బేరం మాట్లాడుకున్నాడు. రొయ్యల చెరువుల వద్ద విద్యుత్‌మీటర్లు కాలిపోయాయని, పనిచేయడం లేదనే కారణాలు చూపి తన ఇంటికి తీసుకెళ్లిపోయాడు. అక్కడి నుంచే రొయ్యల చెరువులకు నామమాత్రపు బిల్లులు వచ్చేలా ప్రతినెలా బిల్లులు చేస్తూ వస్తున్నాడు. దీనిపై విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు అందడంతో ఈ నెల 3వతేదీన అధికారులు రుద్రవరం పరిసర ప్రాంతాల్లోని రొయ్యల చెరువుల వద్ద తనిఖీలు చేశారు. చెరువుల యజమానులు విద్యుత్‌ను వాడుకుంటున్నా.. అక్కడ విద్యుత్ మీటర్లు లేవని గుర్తించారు. బిల్లులు ఎలా చేస్తున్నారని అధికారులు మిగతా 6లో..

మరిన్ని అంతర్జాతీయ సర్వీసులు రావాలి

- ఇండిగోను కోరిన ఏపీ చాంబర్



6లో



అదే కథ!

- తిరువూరు మున్సిపాలిటీలో 22 ఏళ్ల తరువాత సేమ్ సీన్
- నాటి పంచాయితీలో అంతర్గతపోరుతో అధికారం కోల్పోయిన కాంగ్రెస్
- ప్రస్తుతం వైసీపీ పాలకవర్గంలోనూ ఇదే పరిస్థితి
- సంఖ్యాబలం ఉన్నా అధికారం కోల్పోయిన వైనం

అంతర్గత ఆధిపత్య పోరుతో అభివృద్ధిని విస్మరించడం.. కావాలనే అధికారాన్ని చేజార్చుకోవడం.. నాడు కాంగ్రెస్ పాలనలో, నేడు వైసీపీ హయాంలోనే జరిగాయి. తిరువూరు మున్సిపాలిటీలో సంఖ్యాబలం ఉన్నప్పటికీ సొంత పార్టీలో సిగపట్లతో చివరికి ఏమీ మిగలకుండా పోయిన తీరు 22 ఏళ్ల తరువాత మళ్లీ రిపీట్ కావడం చర్చకు దారితీస్తోంది.

- తిరువూరు, ఆంధ్రజ్యోతి

నాడు అలా.. 2001లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో తిరువూరు పంచాయతీలో మొత్తం 20 ఎంపీటీసీ స్థానాలకు కాంగ్రెస్ 16, టీడీపీ 4 గెలుపొందాయి. ఎంపీపీగా కొలికపోగు లక్ష్మణరావు ఎంపికయ్యారు. కొంతకాలం బోర్డు పాలన సజావుగానే సాగినప్పటికీ కాంగ్రెస్ ఎంపీటీసీల్లో నెలకొన్న సంక్షోభంతో నాటి నిబంధనల ప్రకారం రెండున్నరేళ్లకు ఎంపీపీపై అవిశ్వాసం పెట్టారు. మనస్థాపం చెందిన ఎంపీపీ లక్ష్మణరావు కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరారు. కొందరు కాంగ్రెస్ నాయకుల వ్యవహారశైలిని నిరసిస్తూ ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలు టీడీపీకి మద్దతుగా నిలిచారు. నాడు అక్రమంగా అవిశ్వాసం పెట్టి దింపేసిన కొలికపోగు లక్ష్మణరావునే తిరిగి టీడీపీ అభ్యర్థిగా బలపరిచి గెలిపించుకున్నారు.

నేడు ఇలా.. సరిగ్గా 22 ఏళ్ల తరువాత వైసీపీలో కూడా అదే కథ నడిచింది. ప్రస్తుతం మున్సిపాలిటీగా ఉన్న తిరువూరులో వైసీపీకి 17 మంది సభ్యుల బలం ఉంది. టీడీపీ 3 స్థానాలు ఉన్నాయి. అయితే, అధిష్టానం ఆధ్వర్యంలో మొదట్లో తీసుకున్న ఒప్పందం కారణంగా రెండున్నరేళ్లకే చైర్‌పర్సన్ మారాలి. కానీ, అలా జరగలేదు. దీంతో వైసీపీలో అసమ్మతివర్గం ఏర్పడింది. ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో చైర్‌పర్సన్ రాజీనామా అనివార్యమైంది. కానీ, ప్రస్తుతం రాజకీయ నేపథ్యంలో ఇప్పటికే రెండు సార్లు ఎన్నిక రద్దు కాగా, జూన్ 2న ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వైసీపీకి చెందిన కొందరు కౌన్సిలర్లు టీడీపీకి మద్దతుగా నిలబడటంతో కౌన్సిల్‌లో మిగతా 6లో..

మట్టి తవ్వకాలపై గ్రామస్థుల ఆగ్రహం

8లో

నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలు

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

బదిలీలకు వేళాయె!

- ప్రభుత్వ శాఖల్లో ముగిసిన బదిలీల దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 2వతేదీ నాటికి బదిలీల ప్రక్రియ పూర్తిచేసేలా కసరత్తు
- విద్యాశాఖలో ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి కౌన్సెలింగ్
- విధుల్లో చేరిన జెడ్పీ సీఈవో.. కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలని హామీ
- మిగిలిన విభాగాల్లో ఒకటి, రెండు రోజుల్లో పూర్తికానున్న ప్రక్రియ

జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురువారం నాటికి దాదాపు పూర్తయింది. వచ్చిన దరఖాస్తుల్లో ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేసి, మిగిలిన వారిని ఖాళీలను బట్టి బదిలీ చేసేందుకు ఆయా విభాగాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూన్ 1, 2 తేదీల్లో బదిలీల ప్రక్రియను పూర్తి చేసి, జూన్ 3వ తేదీన ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరేలా ప్రణాళికను రూపొందిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలోని వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు సమయం ఆసన్నమైంది. ఇప్పటికే ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని పరిశీలించి ఒకటి, రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆలస్యంగా హెచ్‌ఎంలకు పదోన్నతి కౌన్సెలింగ్

మచిలీపట్నంలోని లేడీయాంప్థిల్ జూనియర్ కళాశాలలో గురువారం ఉమ్మడి జిల్లాల్లోని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు



పదోన్నతి కౌన్సెలింగ్‌లో ప్రధానోపాధ్యాయులు

పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. 393 ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఉదయం 10 గంటలకు పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని విద్యాశాఖ అధికారులు ప్రకటించడంతో ఉపాధ్యాయులు ఆ సమయానికి కౌన్సెలింగ్ జరిగే కేంద్రానికి చేరుకున్నారు. అయితే ఉపాధ్యాయుల పదోన్నతి కౌన్సెలింగ్‌కు సంబంధించిన కీ వివరాలు విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి రాకపోవడంతో కౌన్సెలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం నుంచి జరుగుతుందని డీఈవో పీవీజే రామారావు ప్రకటించారు. మధ్యాహ్నం నుంచి ప్రధానోపాధ్యాయులు వేచి ఉండగా, గురువారం సాయంత్రం 6.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. 393 మంది ప్రధానోపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరు కాగా, వారిలో 198 మందికి పదోన్నతులు ఇచ్చారు. ఇటీవల సవరించిన ఎస్సీ రిజర్వేషన్‌ల ప్రకారం ఎనిమిది మంది ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సు వరుసగా చదవలేదనే కారణంతో హిందీ పండిట్ ఒకరికి పదోన్నతిని అధికారులు నిలిపివేశారు.

జెడ్పీలో కౌన్సెలింగ్ పద్ధతిలోనే బదిలీలు

జిల్లా పరిషత్‌లోని పలు విభాగాల్లో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఇటీవల గందరగోళం నెలకొంది. ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకుంటే కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగులు కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జెడ్పీ ఉద్యోగులకు కౌన్సెలింగ్ పద్ధతిలో కాకుండా, నేరుగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని పాలకవర్గ సభ్యులు చెప్పడంతో ఉద్యోగులంతా ఖంగుతిన్నారు. కౌన్సెలింగ్ పద్ధతిలోనే బదిలీలు చేయాలని ఇటీవల ఇన్‌చార్జి కలెక్టర్, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవోను కలసి విన్నవించుకున్నారు. జెడ్పీ సీఈవో మిగతా 6లో..

కీలక 'మలుపు'

- వెస్ట్ బైపాస్‌లో గొల్లపూడి వద్ద రింగ్ ఏర్పాటుకు కేంద్రం ఓకే
- భూసేకరణ లేకుండానే నిర్మాణానికి ప్రతిపాదన
- వెంటనే పనులు చేపట్టడానికి కేంద్రం అనుమతి
- వారంలో పనులు ప్రారంభమయ్యే అవకాశం
- గొల్లపూడి జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులకు ఇక చెక్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రాజెక్టులో గొల్లపూడి వద్ద రింగ్ నిర్మాణం కీలకం. గొల్లపూడి దగ్గర ఎన్‌హెచ్-65ను అనుసంధానించే చోట ప్రస్తుతమున్న జంక్షన్ ఇబ్బందిగా మారింది. గొల్లపూడి ఆర్‌వోబీ దిగువన, సర్వీసు రోడ్ల మీదుగా ఇటు విజయవాడకు, అటు హైదరాబాద్‌కు



రాకపోకలు సాగించే వాహనాలు మలుపు తిరగటానికి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ వాహనాలు మళ్లీ ఎన్‌హెచ్-65పైకి ఎక్కి, గొల్లపూడి సిగ్నల్ జంక్షన్ వరకు వెళ్లి, అక్కడ ఫ్రీలెఫ్ట్ తీసుకుని తిరిగి హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోంది. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కానీ, గుంటూరు నుంచి విజయవాడ నగరంలోకి వచ్చే వాహనాలు కానీ ఇదే ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తోంది. గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఎన్‌హెచ్-65 మీదుగా సూరాయిపాలెం ట్రాఫిక్ జంక్షన్ వరకు వెళ్లి ఫ్రీలెఫ్ట్ తిరిగి విజయవాడలోకి వెళ్లాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గొల్లపూడి జంక్షన్ వద్ద రింగ్‌ను అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనను తీసుకొచ్చారు. ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఎంపీ కేశినేని చిన్ని కూడా సూచించారు. దీనిపై ఎన్‌హెచ్ అధికారులు సమగ్ర అధ్యయనం చేశాక రింగ్ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. రింగ్ ఏ విధంగా ఏర్పాటు చేయాలన్న దానిపై కన్సల్టెన్సీని నియమించారు. ఈ కన్సల్టెన్సీ సంస్థ ఇటీవలే నివేదిక ఇచ్చింది. భూ సేకరణ అవసరం లేకుండానే, రింగ్‌ను అభివృద్ధి చేయవచ్చని ఆ సంస్థ పేర్కొంది. దీంతో ఆగమేఘాలపై ఈ ప్రతిపాదనను కేంద్రానికి పంపారు. కేంద్రం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో ఇక పనులు ప్రారంభించడమే తరువాయి. వారంలో పనులు ప్రారంభించి, పక్షం రోజుల్లోపే దీనిని పూర్తి చేయటానికి ఎన్‌హెచ్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

క్లోవర్ లీఫ్ జంక్షన్ సంగతేంటి?

గొల్లపూడి వద్ద రింగ్ కనుక అందుబాటులోకి వస్తే.. ఏలూరు, గుంటూరు నుంచి విజయవాడ, మిగతా 6లో..



31న యోగాంధ్ర విజయవంతం చేయాలి

- కలెక్టర్ బాలాజీ పిలుపు

6లో

రాజధాని నిర్మాణంలో భద్రత కట్టుదిట్టం

8లో

- బాలకార్మికులు, లింగ వివక్ష ఉండకూడదు
- సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్




సభలో అమ్మాయిల ఉత్సాహం



మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు





మహా జాతర





కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం










మంగినపూడి బీచ్‌ను సందర్శించిన కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

యోగాంధ్రను విజయవంతం చేయాలి

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్‌లో ఈనెల 31న ఉదయం మెగా యోగా సాధన ఈవెంట్ నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో యోగసాధకులు, ఉద్యోగులు పాల్గొనాలని కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు తదితరులు బీచ్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 1000 మంది పర్యాటకులు బీచ్‌లో యోగా కార్యక్రమంలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శివ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ హరిహరనాథ్, ఆర్డీవో కె.స్వాతి, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, ఆయుష్ అధికారి జావేద్‌ఖాన్, జిల్లా పర్యాటక అధికారి రామ్‌లక్ష్మణ్, తహసీల్దార్లు మధుసూధనరావు, నాగభూషణం, డీఎస్పీ రాజా, యోగాంధ్ర సమన్వయ అధికారి పోతురాజు, జిల్లా స్పోర్ట్స్ అధికారి ఝాన్సీలక్ష్మి, వంకా రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లోకేష్, ఎస్ఈ నటరాజన్, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు, ఎండీవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు

సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం

» వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు

జగ్గయ్యపేట రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : నేల సారాన్ని కాపాడుకునేందుకు రైతులు జీవ, సేంద్రియ ఎరువులను వినియోగించి పరిరక్షించుకోవటం ప్రథమ కర్తవ్యంగా భావించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు సూచించారు. గురువారం గరికపాడు కేవీకేలో భారతీయ వ్యవసాయ మంత్రిత్వశాఖ, వ్యవసాయ పరిశోధనామండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ ప్రీఖరీఫ్, ప్రీపెయిడ్‌నెస్ 15 రోజుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ, మారుతున్న కాలంతో పాటు వ్యవసాయరంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలను రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. పెట్టుబడులను తగ్గించి అధిక ఫలసాయం వచ్చే పంటలపై దృష్టి సారించాలని తెలిపారు. వ్యవసాయానికి అనుబంధంగా రైతులు తప్పనిసరిగా పాడిని కూడా చూసుకోవాలని తెలిపారు. అధిక మోతాదులో ఎరువుల వాడకాన్ని తగ్గించాలని భూసార పరీక్షలతో పాటు పంటలను బట్టి శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో ఎరువులు వాడాలన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అచ్యుతరాజు, జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల పరిధిలోని వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

మరిన్ని అంతర్జాతీయ సర్వీసులు రావాలి

» ఇండిగోను కోరిన ఏపీ చాంబర్

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ, కర్నూలు మధ్య నేరుగా విమాన సర్వీసు ప్రారంభించిన ఇండిగో సంస్థ విజయవాడ నుంచి మరిన్ని అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించాలని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు కోరారు. గురువారం నగరంలోని ఏపీ చాంబర్స్ కార్యాలయంలో ఆఫ్కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ వాణిజ్య సామర్థ్యాన్ని, పరిసర ప్రాంతాల నుంచి ఇండిగో సంస్థకు అందుబాటులో ఉన్న అవకాశాల గురించి సంస్థ బృందానికి ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో దాదాపు ప్రతి కుటుంబంలో ఒక ఎన్నారై ఉన్నారన్నారు. కొన్ని సర్వేల ప్రకారం


సమావేశంలో ఏపీ చాంబర్, ఇండిగో సంస్థ ప్రతినిధులు

విజయవాడ పరిసర ప్రాంతాల్లో సుమారు 5 లక్షల మంది ఎన్నారైలు ఉన్నట్టు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో వివిధ దేశాలకు వలస వెళ్తున్నారని, రాష్ట్రంలో మధ్యతరగతి ప్రజల్లో అధికశాతం విజయవాడ పరిస ప్రాంతాల్లోనే నివశిస్తున్నారని వివరించారు. దుబాయ్, సింగపూర్ ఇతర దేశాలతో అపారమైన వాణిజ్య అవకాశాలు ఉన్నందున అంతర్జాతీయ విమాన సర్వీసులు పెంచాలని ఇండిగో సంస్థను కోరారు. కొంత కాలంగా విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించే వారి సంఖ్య 30 వేలనుంచి 40 వేలకు పెరిగిందన్నారు. విజయవాడ నుంచి విమానాలు ప్రస్తుతం 80శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయన్నారు. ప్రస్తుత విమానాలు చాలా చిన్నవని, రెండు నుంచి మూడు టన్నుల వరకు రవాణా చేసే బెల్లీకార్గోను విజయవాడ నుంచి నడిపే విధంగా ఆలోచించాలని ఆయన సంస్థను కోరారు. గతంలో స్పైస్‌జెట్ రవాణా విమానాన్ని నడిపిందని, అదేవిధంగా విజయవాడ-అహ్మదాబాద్, సూరత్ మధ్య నేరుగా సర్వీసు ప్రారంభించాలని భాస్కరరావు కోరారు.

అదే కథ!

(5వ పేజీ తరువాయి)

టీడీపీకి 11 స్థానాల బలం పెరిగి గెలుపు లాంఛనం కానుంది.

తొమ్మిదేళ్లలో మూడో ఛైర్‌పర్సన్

తిరువూరు మున్సిపాలిటీగా ఏర్పడిన తొమ్మిదేళ్లలో మూడో ఛైర్‌పర్సన్ ఎన్నిక జూన్ 2న జరగనుంది. 2014 మార్చిలో జరిగిన తొలి ఎన్నికల్లో మొత్తం 20 స్థానాలకు గాను టీడీపీ 12, వైసీపీ 7, సీపీఎం ఒక్కస్థానంలో గెలిచాయి. ఐదేళ్ల బోర్డు పరిపాలన సాఫీగానే సాగింది. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తిచేశారు. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ 17, టీడీపీ 3 స్థానాలు గెలుచుకున్నాయి. వైసీపీ బోర్డు ఏర్పాటు నుంచి ఆ పార్టీకి చెందిన కొందరు కౌన్సిలర్లతో పాటు అప్పటి ఎమ్మెల్యే సహాయ నిరాకరణ చేశారు. దీంతో అభివృద్ధి పథకాలు అంతగా జరగలేదు. ఏదేమైనా వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఆధిపత్యపోరే బోర్డు చేజారిపోవడానికి కారణమన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

నోటీసులు అందజేత

తిరువూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉప ఎన్నిక అజెండా నోటీసులు గురువారం కౌన్సిలర్లకు అందాయి. మొత్తం 20 మంది సభ్యులతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యుడు, ఎమ్మెల్యే ఇళ్లకు వెళ్లి గురువారం రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఈ నోటీసులు అందించారు.

కౌన్సిలర్లకు గన్‌మ్యాన్లు

మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఉప ఎన్నిక నేపథ్యంలో టీడీపీ, ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న కౌన్సిలర్లకు గన్‌మ్యాన్లను కేటాయించారు. గురువారం 8 మంది సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. గతంలో 11 మంది కౌన్సిలర్లకు గన్‌మ్యాన్లను కేటాయించగా, ప్రస్తుతం మరి కొందరికి కేటాయించారు.

దర్జాగా బుసక దందా!

(5వ పేజీ తరువాయి)

అక్రమంగా క్వారీ ఏర్పాటు చేయగలిగాడని విమర్శలొస్తున్నాయి. ఇంతకీ ఆయన ఎవరు అంటూ అందరూ చర్చించుకుంటున్నారు. కాగా, వైసీపీ నాయకుడితో స్నేహం ఉన్న టీడీపీ నాయకులు ఇద్దరు నేరుగా క్వారీలోకి వెళ్లి అండగా నిలబడినట్టు తెలిసింది. అందువల్లే రెవెన్యూ యంత్రాంగం అక్రమ క్వారీ వైపు కన్నెత్తి చూడటంలేదని సమాచారం. కూటమి ప్రభుత్వంలో వైసీపీ నాయకుడు అనధికార బుసక క్వారీ ఏర్పాటు చేయటం, కొందరు అధికారులు వత్తాసు పలకటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇసుక, బుసక అక్రమాలను సహించిలేదని సీఎంచంద్రబాబు చేసిన హెచ్చరికలను అధికారులు పెడచెవిన పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి.

బదిలీలకు వేళాయె!

(5వ పేజీ తరువాయి)

కన్నమనాయుడు సెలవులో ఉండటంతో ఈ విభాగంలో జరిగే బదిలీల్లో కొంత గందరగోళం ఏర్పడింది. దీంతో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయ ఉన్నతాధికారులు స్పందించి జెడ్పీ సీఈవోను వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జెడ్పీ సీఈవో గురువారం విధుల్లో చేరారు. వచ్చిన వెంటనే ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. బదిలీల అంశంపై వారితో చర్చించారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం, కౌన్సెలింగ్ పద్ధతిలోనే ఉద్యోగుల బదిలీలు జరుగుతాయని, అందులో సందేహం లేదని సీఈవో స్పష్టం చేశారు. జూన్ 1, 2 తేదీల్లో జెడ్పీ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. జెడ్పీ బదిలీల్లో యూనియన్‌లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్నవారికి ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటు, తదితర అంశాలపై కలెక్టర్‌తో సంప్రదింపులు జరిపి తగు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కాగా, రెవెన్యూ విభాగంతోపాటు డీపీవో, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల్లో బదిలీల కోసం ఉద్యోగుల చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి, ఒకటి, రెండు రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసి కలెక్టర్‌కు సంబంధిత జాబితాలు పంపుతామని అధికారులు పేర్కొంటున్నారు.

కీలక 'మలుపు'

(5వ పేజీ తరువాయి)

హైదరాబాద్ వెళ్లే వాహనాలకు కానీ, హైదరాబాద్, విజయవాడ నుంచి వచ్చే వాహనాలకు కానీ మార్గం సుగమమవుతుంది. వాస్తవానికి గొల్లపూడి జంక్షన్ వద్ద క్లోవర్ లీఫ్ జంక్షన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనలు కూడా నడుస్తున్నాయి. హైదరాబాద్-విజయవాడ మార్గాన్ని ఆరు వరసలుగా విస్తరించటానికి వీలుగా డీపీఆర్ రూపకల్పన జరుగుతోంది. ఈ క్రమంలో గొల్లపూడి జంక్షన్ దగ్గర విజయవాడ బైపాస్‌తో హైదరాబాద్-విజయవాడ మార్గం అనుసంధానమవుతుంది. రెండు ప్రధాన జాతీయ రహదారులు అనుసంధానమయ్యే చోట క్లోవర్ లీఫ్ జంక్షన్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనను కన్సల్టెన్సీ సంస్థ చేస్తోంది. తుది డీపీఆర్‌లో కనుక క్లోవర్ లీఫ్ జంక్షన్‌ను ప్రతిపాదిస్తే, రింగ్‌ను తొలగిస్తారు. హైదరాబాద్-విజయవాడ ఆరు వరసల రహదారి విస్తరణ పనుల పూర్తికి మూడేళ్లు పట్టే అవకాశం ఉంది.

ఉద్యోగి నయా మోసం

(5వ పేజీ తరువాయి)

ఆరాతీస్తే.. అంతా ఉదయభాను చూసుకుంటున్నాడని రైతులు తెలిపారు.

ఉదయభాను ఇంటి వద్ద 18 విద్యుత్ మీటర్లు

విజిలెన్స్ అధికారులు ఉదయభాను ఇంటి వద్ద తనిఖీ చేయగా 18 విద్యుత్ మీటర్లు లభించాయి. మీటర్లను ఇంటి వద్దనే పెట్టుకుని రొయ్యల చెరువుల రైతుల పేరుతో నెల నెలా బిల్లులు మాత్రం ఇస్తున్నట్టుగా అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ఈ అంశంపై ప్రాథమిక విచారణ చేసిన విజిలెన్స్ అధికారులు ఈఈ కార్యాలయంలో నివేదిక అందజేశారు. దీంతో ఉదయభానును సస్పెండ్ చేసినట్టు మచిలీపట్నం ఈఈ కార్యాలయం అధికారులు తెలిపారు. ఈ అంశంపై ఇంకా విచారణ జరుగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత పూర్తిస్థాయి నివేదికను తయారు చేస్తామని అధికారులు చెబుతున్నారు. రుద్రవరం, పరిసర ప్రాంతాల్లో రొయ్యల చెరువులకు విద్యుత్ మీటర్లు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేసిన ఉదయభాను విద్యుత్‌శాఖ ఆదాయానికి నెలనెలా లక్షల రూపాయల్లో గండికొట్టి, అనధికారికంగా ఆ నగదును కాజేశాడనే విమర్శలు వినిపిస్తున్నాయి.


మునేశ్వరరావును అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అభిమాన కార్యకర్తకు సీఎం చంద్రబాబు అభినందన

» 400 కి.మీ సైకిల్‌పై మహానాడుకు

కోడూరు : కోడూరు నుంచి కడప మహానాడుకు సుమారు 400 కిలోమీటర్ల సైకిల్‌పై వెళ్లి అభిమానాన్ని చాటుకున్న టీడీపీ కార్యకర్త దూళిపూడి మునేశ్వరరావును ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ అభినందించారు. పార్టీకి నిబద్ధత గల కార్యకర్తలే బలమని, కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్, మండల అధ్యక్షుడు బండె శ్రీనివాసరావు తదితరులు మునేశ్వరరావుకు అభినందనలు తెలిపారు.


బి.ఎస్.భార్గవ్, జి.అనిత

ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షుడిగా భార్గవ్

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ సంస్థ ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యక్షుడిగా బి.ఎస్.భార్గవ్ కుమార్, గౌరవ ఛైర్మన్‌గా జి.అనిత నియమితులయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ సీహెచ్ భద్ర మాట్లాడుతూ, గాలి కాలుష్యం రానురాను పెరిగిపోతూ ఏటా 16 లక్షల మందికి పైగా మరణిస్తున్నారని, భూమ్మీద సుమారు 70 శాతం మంది కలుషిత నీరు తాగుతున్నారని తెలిపారు. పరిశ్రమలు, భారీ వాహనాల వల్ల ప్రజలు తమ ఆరోగ్యాన్ని కోల్పోతున్నారన్నారు. అడవుల విధ్వంసంతో ఇప్పటివరకు సుమారు 35 వేల హెక్టార్లలో చెట్లను కొట్టేశారని, గాలి, నీరు, భూమి కలుషితమై మానవ జీవనానికి ఇబ్బందిగా మారుతోందని పేర్కొన్నారు. దీనిని ఎంతో కొంత తగ్గించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర చాప్టర్‌కు బి.ఎస్.భార్గవ్‌కుమార్‌ను నియమించినట్లు ఆయన తెలిపారు. గౌరవ ఛైర్మన్ ప్రొఫెసర్ అనిత మాట్లాడుతూ, ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమం, సేవ్ నేచర్, ప్రొటెక్ట్ వాటర్ సోర్స్ లాంటి ప్రోగ్రామ్స్‌తో ప్రపంచ పర్యావరణ సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యత పెంచిందని నూతన అధ్యక్షుడు భార్గవ్ అన్నారు. సమాజంలో ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించే విధంగా భవిష్యత్ కార్యక్రమాలు చేస్తామని చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

నూతన వంగడాలపై రైతులకు అవగాహన

గన్నవరం, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ ఆడిటోరియంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రైతులకు నూతన వంగడాలు, వ్యవసాయ నూతన సాంకేతికతపై చర్చాగోష్టి నిర్వహించి వారికున్న సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలను వివరించి, రైతులకు సమాచారం అందించారు. డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారావు, జ్యోతిరమణి, శ్రీనివాస్, పద్మజ, శైలజారాణి, రజని పాల్గొన్నారు.



కానూరు ప్రధాన రహదారి వెంబడి డంపింగ్ చేసిన వ్యర్థాలు

కానూరు ప్రధాన రోడ్డులో
చెత్త డంపింగ్

● రోడ్డు వెంబడి భారీగా కొబ్బరి బొండాలు, పాల్తీ వ్యర్థాలు
● వ్యర్థాలను తగులబెడుతుండడంతో వెలువడుతున్న పొగ
● ఇబ్బంది పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని అధికారులు



వ్యర్థాలను రిక్షాపై తెచ్చి డంపింగ్ చేస్తున్న వ్యక్తి

(ఆంధ్రజ్యోతి-పెనమలూరు)

కానూరు నుంచి ఏలూరు రోడ్డును కలిపే ప్రధాన మార్గంలో వ్యర్థాల డంపింగ్ చేయడంతో కంపు కొడుతోంది. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ రోడ్డు పక్కనే భారీగా కొబ్బరి బొండాలు, పాల్తీ వ్యర్థాలను డంపింగ్ చేస్తుండడంతో రోడ్డు కుచించుకుపోతోంది. దీంతో ఆ రోడ్డు వెంట ప్రయాణించేవారు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కన వేసిన వ్యర్థాలను కొంతమంది తగులబెడుతుండడంతో వెలువడే పొగ కారణంగా ప్రయాణికులు, దగ్గరలోని హైస్కూలు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎక్కడెక్కడినుంచో వ్యర్థాలను తెస్తున్న వాహనాలు రోడ్డు పక్కనే డంపింగ్ చేసి వెళ్లిపోతున్నాయి. కొద్ది వారాల క్రితం వేరే ప్రాంతాల నుంచి వచ్చి డంపింగ్ చేస్తున్న వాహనాలను స్థానికులు అడ్డుకోవడంతో కొంతకాలం ఆగింది. మళ్లీ స్థానికులు లేని సమయం చూసి వాహనాల్లో వ్యర్థాలను తెచ్చి డంప్ చేస్తున్నారు. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. గ్రామంలో చెత్త సేకరించి కొంతమంది వ్యక్తులు రోడ్డు వెం బడి వేస్తున్నారు. అధికారులు సమస్యపై దృష్టి సారించి పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ చేయండి

● డీలర్లతో తహసీల్దార్ జె.విమలకుమారి



ఉంగుటూరు రేషన్‌షాపులో ఈ పోస్ యంత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విమలకుమారి

ఉంగుటూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, కార్డుదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రేషన్ పంపిణీ చేయాలని డీలర్లకు తహసీల్దార్ విమలకుమారి సూచించారు. జూన్ 1నుంచి రేషన్‌షాపుల వద్ద కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నందున గురువారం తేలప్రోలు, ఉంగుటూరు చౌకధరల దుకాణాల్లో ఆమె ట్రయల్ నిర్వహించారు. ఈ పోస్, ఐరిష్ డివైస్‌లు, ఎలక్ట్రానిక్ కాటాల పనితీరును పరిశీలించారు. జూన్ 1న మండలంలోని 41 రేషన్ డిపోల్లో పండుగ వాతావరణంలో రేషన్ పంపిణీ ప్రక్రియ చేపట్టాలన్నారు. ప్రతినెలా 1వతేదీ నుంచి 15వతేదీ వరకు ఆదివారాల్లో కూడా అన్ని చౌకధరల దుకాణాలు(రేషన్‌డిపోలు)పనిచేయాలని సూచించారు. రోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు కార్డుదారులకు రేషన్ అందించాలని ఆదేశించారు. 65ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి సరుకులు అందజేయాలని స్పష్టంచేశారు.

చైన్ స్నాచర్ అరెస్టు

కంకిపాడు, మే 29(ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈనెల 15వ తేదీన కంకిపాడు ఎస్‌బీఐ వద్ద కొట్టు సాయిలీల అనే మహిళ నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి మెడలోని గొలుసు అపహరించుకుపోయాడు. సాయిలీల ఫిర్యాదు మేరకు ఎస్సై సందీప్ విచారణ చేపట్టారు. గురువారం ఉదయం కంకిపాడు శివాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోరంకి ప్రభునగర్‌కు చెందిన నిమ్మకూరి రమేష్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని విచారించగా జల్సాలకు అలవాటు పడి దొంగతనం చేసినట్టు తేలింది. రమేష్ నుంచి ఐదు గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నాం. కేసును ఛేదించిన ఎస్సై సందీప్, తాతాచార్యులు, హెడ్ కానిస్టేబుల్ చంద్ర, కానిస్టేబుల్ వీఎస్ఎన్ మూర్తి, సయ్యద్ బాజీలను అభినందిస్తున్నా.' అని సీఐ తెలిపారు.



వైవీబీ రాజేంద్రప్రసాద్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్న టీడీపీ నాయకులు

ఘనంగా వైవీబీ రాజేంద్రప్రసాద్ జన్మదినోత్సవం

ఉయ్యూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ, పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వైవీబీ రాజేంద్రప్రసాద్ జన్మదినోత్సవాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, మాజీ అధ్యక్షుడు వేమూరు శ్రీనివాసరావు, ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్, వత్సవాయి కొండలు, కాకాని శ్రీనివాసరావు, ఎస్.వేణు, అంజనేయులు, శేషు తదితరులు వైవీబీకి శుభాకాంక్షలు తెలిపారు. నగర పంచాయతీ కౌన్సిలర్లు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువార్డులో అభిమానులు, కార్యకర్తలు ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో రాజేంద్రప్రసాద్ పాల్గొని కేక్ కట్ చేశారు.

దేశ సమైక్యతను కాపాడాలి



గన్నవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గన్నవరం, మే 29(ఆంధ్రజ్యోతి): దేశంలో మతసామరస్యం వర్ధిల్లాలని, దేశ సమైక్యతను కాపాడాల ని కోరుతూ గురువారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యత ర్యాలీ నిర్వహించారు. గాంధీ బొమ్మ సెంటర్లో ఉగ్రవాదం, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా నాయకులు నిరసన తెలిపారు. దేశంలో యుద్ధ వాతావరణం పెరగడానికి పాలకుల తీరే కారణమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు, టీవీ లక్ష్మణస్వామి అన్నారు. ప్రజలంతా శాంతి సామరస్యాలతో జీవనం సాగించాలని, మతసామరస్యం కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, సమైక్యతను కాపాడుకునేందుకు మేధావులు కృషి చేయాలన్నారు. సీపీఎం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, మీరాఖాన్, అజ్మీర వెంకటేశ్వరరావు, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

ఉయ్యూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 5,291 మంది లబ్ధిదారులకు గ్రామ సచివాలయ సిబ్బంది అందజేస్తారని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా ఉదయం 7 గంటలకే పంపిణీచేస్తారని తెలిపారు. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్యకాలంలో పింఛన్ తీసుకునే భర్త మరణిస్తే వారి భార్యలకు వితంతు పింఛన్ రూ.4వేలను 60మందికి జూన్ 12న పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

ఓఎస్సార్ సదస్సుకు బాపులపాడు ఎంపిక

హనుమాన్‌జంక్షన్, మే 29(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ఓన్ సోర్సు ఆఫ్ రెవెన్యూ(ఓఎస్సార్) సదస్సుకు బాపులపాడు పంచాయతీ ఎంపికైంది. పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులు సమకూర్పు-వినియోగం అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నారు. రూ.50 లక్షల ఆదాయం దాటిన పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులను ఈ సదస్సుకు ఆహ్వానించారు. అందులో భాగంగా బాపులపాడు గ్రామాన్ని ఎంపిక చేసినట్లు ఎంపీడీవో జోగేశ్వరరావు తెలిపారు. పంచాయతీ నుంచి కార్యదర్శి పూర్ణేశ్వరి హాజరవుతున్నట్టు తెలిపారు. .

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఏపీ ఎన్జీవోస్ గన్నవరం శాఖ అధ్యక్షుడు సాంబశివరావు

గన్నవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగు ల సమస్యలు పరిష్కరించడమే ఏపీ ఎన్జీవోస్ లక్ష్యమని గన్నవరం శాఖ అధ్యక్షుడు వి.సాంబశివరావు అన్నారు. స్థానిక ఎన్జీవోస్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల తరబడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవిశ్రాంత కృషి చేస్తూ ఉద్యోగులనే కుటుంబ సభ్యులుగా చేసుకుని వారి కోసం పరిశ్రమిస్తున్న నేత విద్యాసాగర్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారని తెలిపారు. శుక్రవారం విజయవాడ శేషసాయి కల్యాణ మండలంలో జరిగే సభకు ఉద్యోగులు పెన్షనర్లు గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, సీతారాం, డి.శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.



మహానాడు సభా ప్రాంగణంలో టీడీపీ బాపులపాడు మండల నాయకులు

మహానాడులో నాయకుల సందడి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): కడప మహానాడు సభకు బాపులపాడు మండలం నుంచి నాయకులు భారీగా తరలివెళ్లారు. కాకులపాడు, రంగన్నగూడెం, వీరవల్లి, రేమల్లె గ్రామాల నుంచి గురువారం తెల్లవారుజామున కార్లలో తరలివెళ్లారు. మధ్యాహ్నానికి సభాప్రాంగణానికి చేరుకున్న నాయకులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిశారు. చలసాని శ్రీనివాస్, సురేంద్రచౌదరి, లంక అజయ్, ఆనంద్, మొవ్వా వేణుగోపాల్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలి

గన్నవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో మేధస్సు పెరుగుతుందని, విద్యార్థులందరూ పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని గ్రంథాలయ అధికారి కె.జ్యోతికుమారి అన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో గురువారం విద్యార్థులకు యోగా, పుస్తక పఠనం, చెస్ పోటీలు నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకూ అందరికి ఉపయోగపడే పుస్తకాలు, వార్తా పత్రికలు అందుబాటులో ఉన్నాయని వినియోగించుకోవాలని జ్యోతికుమారి సూచించారు.

వీరవల్లి గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ పోటీలు దోహదపడతాయని గ్రంథాలయాధికారి స్వర్ణలతాదేవి అన్నారు. వీరవల్లి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఆమె క్విజ్‌పోటీలు నిర్వహించారు. వయస్సుల వారీగా 4గ్రూపులుగా విభజించి జనరల్‌నాలెడ్జ్, చరిత్రపై పోటీ పెట్టారు. కానుమోలులో గ్రంథాలయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో సుంకర సాంబశివరాయల్ పర్యవేక్షణలో లెమన్ స్పూన్, చెస్ పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ఉయ్యూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కథల పుస్తకాలు, వేమన పద్యాలు చదివించి వాటిలో నీతిని తెలుగు ఉపాధ్యాయురాలు కె.సుజాత తెలియజేశారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి యోగాభ్యాసన చేయించారు. గ్రంథాలయ అధికారి బి.రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్ర నిర్మాణంలో భాగస్వాములవ్వండి

● ప్రజలకు తహసీల్దార్ బి.మురళీకృష్ణ పిలుపు



జంక్షన్ లయన్స్ క్లబ్‌లో యోగాసనాలు వేస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది

హనుమాన్‌జంక్షన్, మే 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్ర నిర్మాణంలో భాగస్వాములవ్వాలని ప్రజలకు బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణ పిలుపునిచ్చారు. యోగాంధ్ర-2025లో భాగంగా లయన్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్న ఐదు రోజుల యోగా శిక్షణ కార్యక్రమంలో గురువారం తహసీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు. శిక్షణ పొందుతున్న పంచాయతీ, రెవెన్యూ సిబ్బందిని ఉత్సాహపరిచారు. కానుమోలు ఆయుర్వేద వైద్యశాల యోగా శిక్షకురాలు ఎస్తేరు రాణి తదితరులు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న వారంతా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధం

ఉంగుటూరు: శారీరక సమస్యలను తొలగించి మానసిక ఒత్తిడులను దూరం చేసి సంపూర్ణ ఆరోగ్యాన్ని సిద్ధింపజేయడంలో యోగా ఒక దివ్య ఔషధంలా పనిచేస్తుందని యోగా మాస్టర్ ట్రైనర్ విజయ్‌కుమార్ అన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా ముక్కపాడు, ఇందుపల్లి, నందమూరు సచివాలయాల పరిధిలో రిజిస్టరైన 28మంది ట్రైనర్లకు గురువారం ఇందుపల్లి జడ్పీహైస్కూల్‌లో యోగా మాస్టర్ ట్రైనర్ ఆధ్వర్యంలో యోగ సాధన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్లు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి వల్లూరి సూర్యప్రకాష్‌నాథ్, టీడీపీ నాయకుడు సీహెచ్ లక్ష్మణరావు, సచివాలయసిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ఇందుపల్లి జడ్పీ హైస్కూల్‌లో..

నేడు మానికొండలో శిక్షణ

మానికొండ, తరిగొప్పల, వేంపాడు సచివాలయాల్లో రిజిస్టర్ చేసుకున్న 36 మంది ట్రైనర్లకు శుక్రవారం ఉదయం 7.30గంటల నుంచి 9గంటల వరకు యోగా మాస్టర్ ట్రైనర్ షేక్ మౌలాలి ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. మానికొండ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించే ఈ యోగసాధనలో రిజిస్టరైన యోగా ట్రైనర్లందరూ హాజరయ్యేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు.



ఆనందం, ఆరోగ్యం యోగాతో సాధ్యం: సీఎస్

సత్యనారాయణపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆనందం, ఆరోగ్యం యోగాతోనే సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కే విజయానంద్, అన్నారు. సత్యనారాయణపురం బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో గురువారం పోలీసు థీమ్ యోగాంధ్ర జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కే విజయానంద్ పాల్గొని,సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి యోగాను చేరవేసేందుకు థీమ్ యోగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వాములైన యోగా ఔనత్యానికి వన్నె తెస్తున్నారన్నారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి. జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 15లక్షల మందికి యోగాను చేర వేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం కమిషనర్ వీరపాండియన్, ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ ఆఫ్ పోలీసు బి. రాజకుమారి, ఐజీ రవికృష్ణ, ఏపీఎస్‌పీ ఐ.జి రత్నకుమార్, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మైనర్‌పై రిటైర్డు టీచరు లైంగిక వేధింపులు

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఒక రిటైర్డ్ టీచరు లైంగిక వేధింపులకు పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జవారుపేటలో ఓ షాపు ఓనరు.. రిటైర్డ్ టీచరు నుంచి కొంతసొమ్ము అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చమని అడిగేందుకు వచ్చిన ఆ రిటైర్డు టీచరు ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను లైంగికంగా వేధింపులకు గురిచేశాడు. దీంతో బాలిక ఫ్యానుకు ఉరేసుకునేందుకు ప్రయత్నించగా తల్లిదండ్రులు రక్షించి ఇనకుదురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు మాట్లాడుతూ రిటైర్డు టీచరుకు 85 ఏళ్లున్నాయని, బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



మణిమేశ్వరంలో టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు

మట్టి తవ్వకాలపై గ్రామస్థుల ఆగ్రహం

బంటుమిల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణిమేశ్వరం గ్రామంలో మట్టి తోలకాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. గురువారం రాత్రి అనుమతులు లేకుండా చెరువులు తవ్వతూ టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. సమాచారం తెలుకున్న గ్రామస్థులు టిప్పర్లను అడ్డుకుని రోడ్డుపై నిరసనకు దిగారు. మట్టి తోలకాల వల్ల రోడ్లు ఛిద్రమవుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. టిప్పర్లు ముందుకు కదలకుండా అడ్డుగా నిలిచి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ శంకర్ సిబ్బందితో కలిసి వచ్చి టిప్పర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. దాదాపు 9 ఎకరాల వ్యవసాయ భూమిలో మట్టి తవ్వి మచిలీపట్నం, పెడనలో వెంచర్లకు తరలిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన రోడ్లను నాశనం చేస్తున్నారన్నారు. ఆర్ఐ బత్తుల శివ శంకర్‌ను వివరణ కోరగా చెరువు తవ్వకాలకు, మట్టి తోలకాలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు చేపడతామన్నారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు

కంకిపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖకు చెందిన భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని ఏసీ నూతక్కి సాంబశివరావు అన్నారు. మండలంలోని నెప్పల్లి గ్రామంలో ఆలయ భూమిని రియల్ వెంచర్ నిర్వాహకులు ఆక్రమించార్న సమాచారంతో అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ, నెప్పల్లిలోని సర్వేనెం 101లో 4.41 ఎకరాల దేవస్థానం భూమిని ఓ రియల్ వెంచర్ నిర్వాహకులు ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. ఇది చట్ట విరుద్ధమని తెలియజేశారు. రోడ్డును తక్షణమే మూసివేస్తున్నామన్నారు. 43 ప్రాపర్టీ రిజిస్టర్‌లో భూమి వివరాలను పొందపర్చటంతో పాటు, భూమిని స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వానికి నివేదిక పంపుతామని వివరించారు.

బాబాయ్.. బాగున్నావా!

● కలెక్టర్ ఆప్యాయ పలకరింపు ● ఆనందం వ్యక్తం చేసిన హమాలీలు

కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ గురువారం గొల్లపూడిలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించారు. అనతరం లారీల నుంచి దిగుమతి అవుతున్న బియ్యం బస్తాలను పరిశీలించారు. ఈ క్రమంలో హమాలీలతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడారు. భారీ బరువులను ఎత్తుతూ దించుతూ ఆరుగాలం కష్టపడే కార్మికులపై ఆయన ఎంతో ప్రేమను చూపారు. హమాలీల భుజంపై చేయివేసి వేసి ఆప్యాయంగా ఆలింగనం చేసుకొన్నారు. 'బాబాయ్...బాగున్నావా'? అంటూ పలకరించారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకొన్నారు. ఒక జిల్లా కలెక్టర్ అత్యంత సామాన్యంగా తమ వద్దకు వచ్చి పేర్లు అడిగి మరీ తెలుసుకొని మాట్లాడటంపై హమాలీలు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ ఏ కలెక్టర్ తమతో ఇలా ముచ్చటించలేదన్నారు.కలెక్టర్ ఇలా తమతో గడపడం చాలా ఆనందాన్నిచ్చిందని ఆ తర్వాత హమాలీలు తెలిపారు.



హమాలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సరుకుల పంపిణీకి సిద్ధంగా ఉండాలి

మండల లెవల్ స్టాక్ పాయింట్ నుంచి (ఎంఎల్ఎస్) నుంచి రేపటిలోగా నిత్యావసర సరుకుల పంపిణీ పూర్తిచేసి రేషన్ దుకాణాల నుంచి సరుకులు పంపిణీకి సిద్ధం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ పునః ప్రారంభం నేపథ్యంలో గురువారం విజయవాడ రూరల్ గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సరుకుల లోడింగ్ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొల్లపూడి ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములోని నిత్యావసర సరుకులను పరిశీలించి, ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి చౌకధరల దుకాణాలకు సరుకుల పంపిణీ, రవాణా చార్జీలు, హమాలీలకు చెల్లింపులు తదితర వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 957 రేషన్ దుకాణాల ద్వారా సుమారు 8,929 టన్నుల బియ్యాన్ని, సుమారు 260 టన్నుల పంచదార పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగులు, 65ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ సరుకులు పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా తక్షణం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

రాజధాని నిర్మాణంలో భద్రత కట్టుదిట్టం

● బాలకార్మికులు, లింగవివక్ష ఉండకూడదు ● సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

విజయవాడ, మే 29 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతకు సంబంధించి నిర్దేశించిన నిబంధనలన్నీ రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు సంస్థలు పాటించాలని సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ సూచించారు. రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతల పర్యవేక్షించే విషయం గురించి విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో గుత్తేదారు సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని నిర్మాణపనుల్లో బాలకార్మికలు, లింగవివక్షకు తావులేదన్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణ, కార్మికుల భద్రతకు సంబంధించిన అంశాలలో పోలీస్, అగ్నిమాపక శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు, మేనేజ్మెంట్ కన్సల్టెన్సీ, సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. నిర్మాణపనుల్లో గుత్తేదారు సంస్థలు పాటించాల్సిన ప్రమాణాలను ఇప్పటికే తెలిపామని, పీఎంసీ సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీశ్‌తో పాటు ఇతర అధికారులు సమావేశంలో చేసిన సూచనలు, అంశాలను ప్రణాళికాబద్ధంగా అమలుచేస్తామన్నారు. పోలీసుశాఖ కోరినట్టు రాజధానిలో భద్రతా కార్యకలాపాల నిర్వహణ, శాంతిభద్రతల పర్యవేక్షణలో సీఆర్డీఏ నుంచి సహకారం అందజేస్తామని ప్రవీణ్‌చంద్ వెల్లడించారు. సీఆర్డీఏ చీఫ్ ఇంజినీర్లు డి.శ్రీరామచంద్రమూర్తి, ధనుంజయ, ఎన్.శ్రీనివాసులు, సీఆర్డీఏ, ఏడీసీఎల్‌లోని వివిధ విభాగాల అధికారులు, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, తుళ్లూరు పీఎస్ ఎస్‌డీపీవో మురళీకృష్ణ, సీఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌చంద్

పాలడుగు శివకు గద్దర్ అవార్డు



ఉయ్యూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం ముదునూరుకు చెందిన పాలడుగు శివకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తమ కథారచయితగా గద్దర్ అవార్డు ప్రకటించింది. మ్యూజిక్ షాప్ మూర్తి సినిమా కథారచయిత అయిన పాలడుగు శివకు 2024వ సంవత్సరానికి ఉత్తమ కథా రచయితగా ఎంపికైనట్టు తెలంగాణ ప్రభుత్వం గురువారం ప్రకించింది. ముదునూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణ కుమారుడు పాలడుగు శివ విదేశాల్లో చదువుకుని, వ్యాపారం చేసి తిరిగి వచ్చి తెలుగు సినిమాపై అభిమానం, ప్రేమతో సినీరంగంలో అడుగిడి కథారచయిత, నిర్మాతగా నిలవగా తొలిచిత్రానికి ఉత్తమ కథారచయితగా తెలంగాణ ప్రభుత్వం అవార్డు ప్రకటించడంపై సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు, నిర్మాత వల్లభనేని వెంకటేశ్వరరావుతో పాటు ముదునూరు గ్రామస్థులు అభినందనలు తెలిపారు. మొదటి సారిగా కథరాసి, డైరెక్షన్ చేసి తొలిసారిగా నిర్మించిన సినిమాకు అవార్డు రావడం ఆయన ప్రతిభా పాటవాలకు నిదర్శనంగా పలువురు పేర్కొన్నారు. శివకు ఉత్త కథారచయితగా తొలిసారి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల సత్యనారాయణ, దాసేరవి, తదితరులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

నేర నియంత్రణకు డ్రోన్ కెమెరాలు

● ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్



మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్ పరిధిలో నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, డ్రోన్ కెమెరాలతో నిందితులను పసిగడుతున్నామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆయన వార్షిక తనిఖీ చేశారు. వివిధ సెక్షన్లలో రికార్డులను పరిశీలించారు. జిల్లా క్రైమ్ రికార్డు బ్యూరో, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, ఫింగర్ ప్రింట్ విభాగం, హోమ్‌గార్డ్స్ విభాగం, డాగ్ స్క్వాడ్ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కృష్ణాజిల్లాలో 4వేల సీసీ కెమెరాలను అమర్చారని, దీంతో కేసులు వేగంగా దర్యాప్తు చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. డ్రోన్ కెమెరాలతో నిందితులను తేలిగ్గా పసిగడుతున్నామన్నారు. ఓపెన్ డ్రింకింగ్, ఆకతాయిల వేధింపులు తగ్గేందుకు డ్రోన్ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు బారికేడ్లు, రేడియం స్టిక్కర్లు, డ్రమ్ములను ఏర్పాటు చేశామన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి వినియోగాన్ని నివారించేందుకు ప్రతి ప్రదేశంలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి వినియోగాన్ని కూకటివేళ్లతో పెకలించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా మీ కోసం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఐజీ హోంగార్డ్స్ యూనిట్ ఆఫీసు, ఇండోర్ షటిల్ కోర్టు, బ్యాడ్మింటన్ కోర్టులను పరిశీలించి మొక్కలు నాటారు.

మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను రెండవ రోజు విచారించిన పోలీసులు

తుళ్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి రాజును చితక బాదిన కేసులో బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు రిమాండ్ విధించారు. కేసులో అదనపు సమాచారం కోసం గుంటూరు జిల్లా జైలులో ఉన్న నందిగం సురేశ్‌ను మూడు రోజులు కస్టడీ కోరుతూ తుళ్లూరు పోలీసులు మంగళగిరి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను కోర్టు అనుమతించడంతో బుధవారం జిల్లా జైలు నుంచి నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ మొదలు పెట్టారు. ఈ కేసులో నందిగం పాత్రం ఎంత మేరకు ఉందనేది విచారిస్తున్నారు. కేసులో నందిగం సురేష్‌తో పాటు ఎంత మంది పాల్గొన్నారు? బాధితుడు రాజును బైకుపై ఎక్కించుకెళ్లి కొట్టిన వారి వివరాలు, ఆ బైకు నెంబర్ వివరాలు, రెండవ రోజు గురువారం విచారణలో పోలీసులు నందిగం సురేశ్ నుంచి సేకరించినట్టు తెలిసింది. మూడో రోజు శుక్రవారం కూడా మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పోలీసులు విచారించనున్నారు.

వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్ర భాగస్వామ్యం కీలకం

» వికసిత్ భారత్ కార్యక్రమంగా 20 సూత్రాల అమలు: లంకా దినకర్

న్యూఢిల్లీ, మే 29(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌లో స్వర్ణాంధ్ర భాగస్వామ్యం కీలకమని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ అన్నారు. గురువారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దాలని ప్రధాని మోదీ లక్ష్యంగా పెట్టుకోగా, ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. 20 సూత్రాల అమలు కార్యక్రమాన్ని పీఎం వికసిత్ భారత్ అమలు కార్యక్రమంగా మార్చనున్నట్టు తెలిపారు.

ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జిగా 'గన్ని'

» 13 డీసీసీబీలకు పీఐసీల నియామకం

అమరావతి, మే29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్ (ఆప్కాబ్) నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉంగుటూరు నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆప్కాబ్‌కు ప్రస్తుత అధికారిక పర్సన్ ఇన్‌చార్జి గడువు 2025 జూలై 17వరకు ఉన్నందున, మిగిలిన కాలంలో బ్యాంక్ వ్యవహారాలను నిర్వహించడానికి నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా వీరాంజనేయులు పదవిలో ఉంటారని పేర్కొంది. అలాగే రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లోని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ)ల నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను ఎంపిక చేసిన ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. డీసీసీబీల అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ప్రకారం జూన్ 26వరకు నాన్ ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలు కొనసాగుతారని ప్రభుత్వం తెలిపింది. తదుపరి, ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జితో పాటు, వీరందరి పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించే అవకాశం ఉంది.

మహిళా కమిషన్ విధివిధానాలపై చర్చ

» మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శితో ఛైర్‌పర్సన్ భేటీ

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ గురువారం మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారితో అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్‌కు సంబంధించిన విధి విధానాలపై చర్చించారు. కమిషన్ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక తదితరాలపైనా చర్చ జరిగింది.

మద్దతు ధరలను పునఃసమీక్షించాలి: సీపీఐ

అమరావతి, మే 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పంటలకు ప్రకటించిన కనీస మద్దతు ధరలపై పునఃసమీక్ష నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ధాన్యానికి కంటితుడుపు చర్యగా క్వింటాకు రూ.69 మాత్రమే పెంచడం దారుణమన్నారు. మొక్కజొన్నకు రూ.175, కందులకు రూ. 450, మినుములకు రూ. 400, పెసలకు రూ. 86, వేరుశనగకు రూ.480, పొద్దుతిరుగుడుకు రూ. 441, పత్తికి రూ. 589 పెంచిందని, ఆయా పంటలకయ్యే పెట్టుబడి ఖర్చులతో పోల్చుకుంటే ఈ పెంపుదల నామమాత్రమేనని తెలిపారు.

కారు నడుపుతూ.. అల్పాహారం!

అదుపుతప్పి డివైడర్‌పైకి.. ముగ్గురి మృతి.. మృతులు ముగ్గురూ తోడికోడళ్లు



తోడికోడళ్లు ఝాన్సీరాణి, సూర్యకుమారి, సరస్వతి (ఫైల్)

» అరుణాచలం బయలుదేరిన కొద్దిసేపటికే ఘోరం

» ఇద్దరికి గాయాలు.. అంతా తెనాలి వాసులు

» బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ప్రమాదం

మేదరమెట్ల, తెనాలి, మే 29(ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన ఆ ముగ్గురూ మూడు కుటుంబాల నుంచి అదే పట్టణంలోని మెట్టినింటికి వచ్చినా.. సొంత అక్క చెల్లెళ్లకంటే కలిసిమెలిసి ఉండేవారు. ఏ కార్యక్రమమైనా కలిసే చేసేవారు. ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్లేవారు. ఆఖరికి.. మరణంలోనూ ఒకరినొకరు వీడలేకపోయారు! బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలో హైవేపై గురువారం జరిగిన కారు ప్రమాదంలో ఒకే కుటుంబంలోని ముగ్గురు తోడికోడళ్లు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. తెనాలికి చెందిన కన్నిగంటి నరసింహారావు, కన్నిగంటి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు అన్నదమ్ములు. వీరంతా వ్యాపార, విద్యా సంస్థల నిర్వహణలో స్థిరపడ్డారు. వివాహాలు కూడా తెనాలికి చెందిన సూర్యకుమారి, సరస్వతి, ఝాన్సీరాణిలను చేసుకున్నారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరేసి సంతానం కాగా, వారందరికీ వివాహాలు జరిగాయి. ఆరు పదుల వయస్సులో భర్తలతో సంతోషంగా శేషజీవితం గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో అరుణాచలేశ్వరుని దర్శించుకోవాలని భర్తల అనుమతి తీసుకుని.. వారి ఆడపడుచు కృష్ణంశెట్టి పార్వతితో కలసి ఝాన్సీరాణి(60) కుమారుడి కారులో గురువారం ఉదయం 11 గంటల సమయంలో తమిళనాడు బయలుదేరారు. ఝాన్సీరాణి కుమారుడు నాగార్జున కారు నడుపుతుండగా, పక్కన కూర్చొన్న తల్లి అతడికి అల్పాహారం తినిపిస్తోంది. సరిగ్గా ఆ సమయంలో కారు అతివేగంతో వెళుతుండగా.. మేదరమెట్ల-తిమ్మనపాలెం మధ్య రోడ్డుపై అదుపుతప్పి ఒక్కసారిగా డివైడర్‌పైకి దూసుకెళ్లింది. డివైడర్ దిమ్మెను బలంగా ఢీకొని రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న ఝాన్సీరాణి అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదం జరిగిన వెంటనే పెద్దఎత్తున స్థానికులు, వాహనదారులు చేరుకుని గాయపడిన వారిని కారులో నుంచి బయటకు తీశారు. మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఘటన స్థలికి చేరుకుని, తీవ్రంగా క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సూర్యకుమారి(62), సరస్వతి(65) మృతిచెందారు. నాగార్జున, పార్వతి తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. కాగా, ప్రమాదంలో గాయపడిన నాగార్జున కొద్దిసేపటి తర్వాత కోలుకుని 'మా అమ్మేదీ.. అమ్మేదీ'.. అంటూ చుట్టుపక్కల వెతుకుతూ రోదించిన తీరు అక్కడ ఉన్న అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, ఆరు పదుల వయస్సు దాటిన భర్తలకు చివరి వరకు తోడుండాల్సిన వారు దూరమైపోవటం ఆ మూడు కుటుంబాల వారు, బంధువులు తీరని శోకంలో మునిగిపోయారు. బంధువులంతా తెనాలి నుంచి సంఘటన జరిగిన మేదరమెట్ల ప్రాంతానికి తరలివెళ్లారు. ఈ వార్త క్షణాల్లో తెలియటంతో తెనాలి పట్టణంలోనూ విషాదం నెలకొంది.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కడప మేయర్ విషయంలో స్టేటస్ కో పాటించండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): కడప మేయర్ సురేష్‌బాబు విషయంలో యథాతథస్థితి (స్టేటస్ కో) పాటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. మేయర్ బాధ్యతల నుంచి తొలగిస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. న్యాయవాదిని నియమించుకొని వివరణ ఇచ్చేందుకు రెండువారాల సమయం ఇవ్వాలన్న పిటిషనర్ వినతిని ప్రభుత్వ ఉత్తర్వుల్లో ప్రస్తావించలేదని పేర్కొంది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులకు అనుగుణంగా వాదన వినిపించేందుకు పిటిషనర్‌కు తగిన అవకాశం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. తనను మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఈనెల 14న పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేయాలంటూ సురేష్‌బాబు హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్ దాఖలు చేశారు. ఆ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరిస్తూ అనుబంధ పిటిషన్‌ను కొట్టివేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ సురేష్‌బాబు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. సురేష్‌బాబు తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపించారు. వర్ధిని కనస్ట్రక్షన్స్ కంపెనీకి పనుల కేటాయింపుపై పిటిషనర్‌కు అవగాహన లేదన్నారు. ఆరోపణలపై వివరణకు సమయం ఇవ్వకుండానే మేయర్ పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పురపాలకశాఖ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది యతీంద్ర దేవ్, కడప ఎమ్మెల్యే మాధవి తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. మేయర్ పదవిని పిటిషనర్ దుర్వినియోగం చేశారన్నారు. కుటుంబ సభ్యులకు కార్పోరేషన్ పనులు అప్పగించి మేయర్ పదవికి పిటిషనర్ అర్హత కోల్పోయారన్నారు. వివరణ ఇచ్చేందుకు పిటిషనర్‌కు తగినంత సమయం ఇచ్చామన్నారు. గతంలో డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగానే వివరణ తీసుకున్న తరువాతే పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం మేయర్ విషయంలో స్టేటస్ కో పాటించాలని ఆదేశించింది.

యూఎస్ కాలిఫోర్నియాలో ఘనంగా మినీ మహానాడు

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): అమెరికా, కాలిఫోర్నియాలోని ఫ్రీమాంట్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు, మినీ మహానాడు 2025 కార్యక్రమం ఘనంగా జరిగాయి. బే ఏరియాలోని భీమవరం రుచులు బాంకెట్ హాలులో బుధవారం రాత్రి టీడీపీ ఎన్నారై నేత దొడ్డపనేని శ్రీకాంత్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా, వక్తలుగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కర్నూలు ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి నేత బుచ్చి రాంప్రసాద్, తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలు తిరునగరి జ్యోత్స్న, ఎన్టీఆర్ వీరాభిమాని ఎల్ రమణ, టీడీపీ ఎన్నారై అధ్యక్షుడు వేమూరు రవి, యూఎస్ఏ కోఆర్డినేటర్ జయరాం కోమటి తదితరులు వర్చువల్‌గా హాజరయ్యారు.

ఒట్టు.. 'మట్టి'తో సంబంధం లేదు

» పోలీసుల విచారణలో వంశీ ప్రధాన అనుచరుడు రంగా బుకాయింపు

» నేడూ ప్రశ్నించనున్న అధికారులు

విజయవాడ/గన్నవరం, మే 29(ఆంధ్రజ్యోతి): "గ్రావెల్, మట్టి తవ్వకాల గురించి ఏమీ తెలీదు. వాటిని ఎవరు తవ్వారో అంతకన్నా తెలీదు" అని గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగా పోలీసులకు చెప్పారు. గన్నవరం, బాపులపాడు మండలాల్లో జరిగిన అక్రమ తవ్వాలకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో రంగాను గురువారం కస్టడీకి తీసుకున్నారు. రంగాను కోర్టు రెండు రోజుల కస్టడీకి అనుమతించడంతో గన్నవరం పీఎస్‌కు తరలించి డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు విచారించారు. గన్నవరం, బాపులపాడు మండలాల్లో మట్టిని, గ్రావెల్‌ను ఎవరి ప్రోద్బలంతో తవ్వారని ప్రశ్నించగా, వాటి గురించి తనకేమీ తెలియదని రంగా జవాబు ఇచ్చారు. ఈ రెండు వ్యవహారాలను వంశీ వద్ద చక్కబెట్టింది మీరే కదా? అని ప్రశ్నించగా గుర్తులేదని సమాధానం ఇచ్చారు. తవ్విన మట్టిని ఎక్కడికి తరలించారని అడిగితే మౌనం వహించారు. మట్టి, గ్రావెల్ అమ్మకాల డబ్బులు ఎవరికి చేరాయని అడిగినా సమాధానం ఇవ్వలేదు. తాను వంశీ వద్ద ఉన్నప్పటికీ నగదు, తవ్వకాల వ్యవహారాల్లో వేలు పెట్టలేదని చెప్పినట్టు తెలిసింది. ఎక్కడైనా సమావేశాలు, కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని వంశీ చెబితే ఆ పనులు మాత్రమే చేసేవాడిన్నట్టు తెలిసింది. తొలిరోజు 25 ప్రశ్నలు సంధించినట్టు సమాచారం. కాగా, శుక్రవారం కూడా రంగాను ప్రశ్నించనున్నారు.

మావోయిస్టుల అంత్యక్రియల కోర్టుధిక్కరణ పిటిషన్ కొట్టివేత

» ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అధికారులపై చర్యలు మా పరిధి కాదు: హైకోర్టు

అమరావతి, మే 29(ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు, మావోయిస్టు పత్రిక 'అవామ్ ఇ జంగ్' ఎడిటోరియల్ బోర్డు సభ్యుడు సజ్జా వెంకట నాగేశ్వరరావుల మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించాలనే ఆదేశాలను ధిక్కరించిన ఛత్తీస్‌గఢ్ సీఎస్, డీజీపీ, బస్తర్ రేంజ్ ఐజీలపై కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించాలంటూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఎన్‌కౌంటర్, అంత్యక్రియలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగాయని, ఆ రాష్ట్ర అధికారులపై కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించే అధికార పరిధి తమకు లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.హరినాథ్, జస్టిస్ వై.లక్ష్మణరావుతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. నంబాల కేశవరావు తల్లి భారతమ్మ, సోదరుడు ఢిల్లీశ్వరరావు, సజ్జా వెంకట నాగేశ్వరరావు సోదరుడు సజ్జా శ్రీనివాసరావు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించే విషయంలో ఛత్తీస్‌గఢ్ ఏజీ కోర్టుకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా పోలీసులే మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారని కోర్టు దృష్టికి తెచ్చారు. బాధ్యులైన ఛత్తీస్‌గఢ్ సీఎస్, డీజీపీ, బస్తర్ రేంజ్ ఐజీపై కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించాలని కోరారు.

ఆంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.7.34 లక్షలు



పామర్రు, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉండ్రపూడి - పోలవరం అడ్డరోడు వీరాంజనేయ స్వామి దేవస్థానం లో హుండీల కానుకలను గురువారం లెక్కించారు. మొత్తం 75 రోజులకు రూ.7,34,410 ఆదాయం వచ్చినట్లు ఆలయ పర్యవేక్షణాదికారి ఎస్.వి.సుబ్బారావు తెలిపారు. ఈ లెక్కింపులో ఉండ్రపూడి, పోలవరం గ్రామాల కూటమి నాయకులతో పాటు పవన్, కూనపరెడ్డి సుబ్బారావు, మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు వెన్నా శ్రీనివాసరావు, గంటయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



తాడంకి అండర్‌పాస్ సమీపాన రెండు వైపులా సర్వీసు రోడ్డుపై ఏర్పడిన పెద్దపెద్ద గోతులు

సర్వీసు రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు
ప్రమాదాల బారిన వాహనదారులు

(ఆంధ్రజ్యోతి-ఉయ్యూరు) : విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిలో మండల పరిధిలోని సర్వీసు రోడ్ల పెద్ద పెద్ద గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ గోతుల్లో వర్షపు నీరు చేరి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాడంకి వద్ద అండర్ పాస్‌కు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లలో పెద్ద గుంతలు ఏర్పడడంతో పెద్ద వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉన్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తాడంకి, గోపువానిపాలెం వైపు వెళ్లే సర్వీసు రోడ్లలో గుంతలు ఏర్పడగా హైవే సిబ్బంది రోడ్లు శుభ్రపరచగా వచ్చిన దుమ్ము, మట్టితో నింపి చేతులు దులుపుకున్నారు. వర్షాలకు గుంతల్లో పోసిన మట్టి, దుమ్ము కొట్టుకుపోయి యధాస్థితికి చేరుకున్నా హైవే అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురజాడ చెరువు సమీపాన ఎస్టీలు నివసించే చెరువుకట్ట ప్రాంతంలో సర్వీసు రోడ్డు పొడవునా పెద్ద గుంతలు పడగా వారి పిల్లలు ఆడుకుంటూ వాటిలో పడి గాయాలపాలవుతున్నారు. తాడంకి అండర్‌పాస్‌లో కూడా పెద్ద గుంత ఏర్పడింది. వర్షపునీటితో నిండి వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. ఇప్పటి కైనా హైవే అధికారులు స్పందించి రోడ్లపై గుంతలు పూడ్చాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత శివరత్న ప్రసాద్ మృతి



శివరత్న ప్రసాద్ (ఫైల్)

పమిడిముక్కల, మే 29 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, రైతు నాయకుడు చిగురుపాటి శివరత్నప్రసాద్ (శివయ్యబాబు) (78) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. కాంగ్రెస్ నాయకునిగా అనేక పదవులు అలంకరించిన శివరత్నప్రసాద్ రైతు నాయకునిగా చెరకు రైతుల సంక్షేమం, అభివృద్ధికి అవిరళ కృషిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివరత్న మృతదేహానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వాహనదారులకు కల్వర్టుల కష్టాలు

- శరత్ థియేటర్ రోడ్డుపై రెండడుగుల ఎత్తు నిర్మాణం
- రాజేంద్రనగర్‌లో రోడ్డుపై మూడడుగుల ఎత్తులో నిర్మాణం



రాజేంద్రనగర్‌లో మూడు అడుగుల ఎత్తులో నిర్మించిన కల్వర్టు



శరత్ థియేటర్ వద్ద రెండడుగుల ఎత్తులో నిర్మించిన కల్వర్టు, ఏర్పడిన గొయ్యి

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

గుడివాడ పట్టణంలో అక్కడక్కడా ఏర్పాటు చేసిన కల్వర్టులు రోడ్డుకు ఎత్తులో నిర్మించడంతో ప్రజలు, వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్టాండు నుంచి ఏజీకే సెంటర్ వదరకు అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. శరత్ థియేటర్ వద్ద విజయవాడ రోడ్డుకు రెండు అడుగుల ఎత్తులో కల్వర్టు నిర్మించారు. వాహనాల ముందు భాగాలు కల్వర్టుకు తగిలి చాసిస్‌లు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. కల్వర్టుకు మరోవైపు పెద్ద గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాజేంద్రనగర్‌లో డీఎస్పీ కార్యాలయం ఎదురు రోడ్డులో మూడు అడుగుల ఎత్తులో కల్వర్టు నిర్మించడంతో కనీసం ద్విచక్రవాహనం, కారు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాహనాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని డ్రైవర్లు, వాహనదారులు వాపోయారు.

పామర్రు, గుడివాడలో వికసిత్ కృషి అభియాన్ సదస్సు నేడు

పామర్రు, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో పంటల సాగు చేసేవిధంగా ప్రోత్సహించేందుకు భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్త ఆధ్వర్యంలో పామర్రు వ్యవసాయ మార్కెట్ యార్డు నందు ఈనెల 30న వికసిత్ కృషి సంకల్ప అభియాన్ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం జిల్లా సమన్వయకర్త సీనియర్ శాస్త్రవేత్త డి.సుధారాణి గురువారం విలేకరులకు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తు వ్యవసాయ ప్రణాళికలో కేవీకేబృందం అన్ని మండలాలు సందర్శించనున్నట్లు చెప్పారు. రైతులతో వ్యవసాయం, ఇతర రంగాల గురించి చర్చించడంతోపాటు కొత్త వరి వంగడాలు, సాంకేతికత, పశుసంపద విలువ ఆధారిత ఉత్పత్తులు,సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఘంటసాల వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త రేవతి, పామర్రు ఏవో విశివ నాగరాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి సంకల్ప కృషి అభిమాన్ కార్యక్రమం శుక్రవారం గుడివాడ మార్కెట్ యార్డులో జరుగుతుందని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి తెలిపారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొని రైతులకు ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పిస్తారన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

నందివాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గుడివాడ మండలం శేరీగొల్వేపల్లికి చెందిన నెరుసు సాంబశివరావు(75) మతిస్థిమితం కోల్పోయాడు. నందివాడ మండలం జనార్దనపురం శివారు టెలిఫోన్‌నగర్‌లోని ఆర్వీవో ట్రాక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో సాంబశివరావు దుర్మరణం చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందివాడ ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

సీఎస్ఐ పాస్టర్ సుధాకర్ గుండెపోటుతో మృతి



గుడివాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్ రోడ్డులోని సీఎస్ఐ చర్చిలో విధులు నిర్వర్తిస్తున్న పాస్టర్ రెవరెండ్ కాటి కమల్ సుధాకర్ (56) గుండెపోటుతో మృతి చెందాడు. సుధాకర్ మంగళవారం అస్వస్థతకు గురికావడంతో విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 31వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వలి సమీపంలోని దోసపాడు గ్రామంలో భూస్థాపిత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సుధాకర్ కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గుడివాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల నిమిత్తం 30వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 2గంటలకు పట్టణంలోని పెదకాలువ సెంటర్, శ్రీలక్ష్మీనగర్ కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



సీఎం సాయం పంపిణీ

గుడ్లవల్లేరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : విన్నకోట గ్రామంలో పేదకుటుంబానికి చెందిన పేర్ని సురేష్ కుమార్తె పేర్ని శ్రీదివ్య అనారోగ్యానికి గురి కాగా సీఎం సహాయ నిధి నుంచి రూ.3.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు చెక్కును టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు జగన్మోహనరావు, జనసేన పార్టీ కార్యదర్శి పేర్ని జగన్, పండ్రాజు సాంబయ్య గురువారం అందజేశారు. సీఎం సాయం మంజూరు కృషి చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

మోటూరు, చౌటపల్లి హెచ్‌ఎంలుగా ప్రసాద్, శ్రీలక్ష్మి బాధ్యతల స్వీకారం



గుడివాడ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : బదిలీల్లో భాగంగా మోటూరు ఉన్నత పాఠశాల గ్రేడ్-2 హెచ్‌ఎంగా వి.వి.ఎస్ఎస్.జి.ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండవల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ మోటూరుకు బదిలీపై వచ్చారు. చౌటపల్లి ఉన్నత పాఠశాల గ్రేడ్-2 హెచ్‌ఎంగా గొడ్డపాటి శ్రీలక్ష్మీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బొమ్మినంపాడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ బదిలీపై చౌటపల్లి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఎంతఈవోలు గ్రేడ్-1, గ్రేడ్-2, రెండు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వారికి అభినందనలు తెలియజేశారు.



బాధిత కుటుంబానికి సీఎం సాయం

గుడివాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ మండలం బిళ్లపాడు శివారు చిన ఎరుకపాడుకు చెందిన బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.80 వేలు మంజూరు కాగా, పామర్తి నాగజ్యోతికి గురువారం ప్రజావేదికలో టీడీపీ నాయకులు రాంబాబు, మురళీ పత్రాలు అందజేశారు. నాయకులు చేకూరు జగన్మోహనరావు, లింగం చిట్టిబాబు, సూరిబాబు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



అనాథ వృద్ధుడి మృతదేహానికి ఆర్‌కే అంత్యక్రియలు

గుడివాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధుడి భౌతికకయానికి బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నీ తానై గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చడమే కాకుండా అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నేటికి 133 అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం దేవుడి ఇచ్చిన శక్తి అని పేర్కొన్నారు. నేతాజీ, అత్తలూరి రవికిరణ్, గాదె చరణ్, తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న కూటమి నాయకులు

జైశ్రీనాట్యమండలి ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు

గుడివాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : బేతవోలులోని ఆనందేశ్వరస్వామి దేవస్థాన కళావేదికపై రాష్ట్ర సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. జై శ్రీనాట్యమండలి నిర్వాహకులు జిల్లా సాంస్కృతిక ఉపాధ్యక్షులు కొడాలి రాజా బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దుర్యోధన మయసభ, శ్రీకృష్ణార్జున, హరిశ్చంద్ర పాత్రధారులు తమ అభినయంతో ఆకట్టుకున్నారు. అత్యున్నత ప్రదర్శనలు చేసిన కళాకారులను గురువారం సాయంత్రం కూటమి నాయకులు అభినందించారు. టీడీపీ నాయకుడు పోలాసి ఉమా, జనసేన జిల్లా నాయకులు పాలంకి సారథిబాబు, స్థానికులు విశ్వనాద్, నాగరాజు, బెల్లం కొండ,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయాల్లో హస్తకళలపై శిక్షణ

గుడ్లవల్లేరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు పుస్తక పఠనం, కథలు చెప్పడం వంటి వాటితో పాటు వినూత్న ఆటలు ఆడుతూ సరదాగా గడుపుతున్నారు. గురువారం వాటర్‌బాల్ గేమ్,పేపర్ బాల్ గేమ్ ఆడారు. హస్తకళల్లో భాగంగా పేపర్లతో పువ్వులు, బొమ్మలు చేయడం వంటి నైపుణ్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారిణి టి.వాణి పర్యవేక్షించారు.



పెదపారుపూడి గ్రంథాలయంలో..

పెదపారుపూడి, మే 28 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ధ్యానం - ఏకాగ్రత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. గ్రంథాలయ అధికారిణి ఎంవి.ఎస్.లక్ష్మీ మాట్లాడుతూ మన భారతీయ జీవన విధానం ఎంతో ఉన్నతమైనదని, మన మహర్షులు, రుషులు అనంతమైన వేద వాంగ్మయాన్ని అవపోసన పట్టడానికి కారణం ధ్యానం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆంగ్లభాషపై అవగాహన

పామర్రు, మే 29 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలు భవిష్యత్‌కు దిక్సూచిలుగా నిలుస్తాయని, విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించడానికి గ్రంథాలయాలు దోహదంగా ఉంటాయని గ్రంథాలయాధికారి ఎంయూస్వీరాణి, వీరంకి నాగసురేష్, అన్నారు. స్థానిక గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా తరగతుల నిర్వహణలో భాగంగా గురువారం విద్యార్థులకు ఆంగ్లభాష, గణితం సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నదానం

గుడివాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా కలవలపల్లి గ్రామానికి చెందిన జొన్న రమేష్, లక్ష్మీ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా గురువారం ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ చేతుల మీదగా కర్ల వృద్ధాశ్రమంలో భోజనం పెట్టి, నిత్యావసర వస్తువులను అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హరి కుమార్, సేవాసంఘం సభ్యులు తిరుపతయ్య, మునీంద్ర, తాతారావు, హరిబాబు, కర్ల వృద్ధాశ్రమ నిర్వాహకులు కర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్‌లో యోగా శిక్షణ

గుడివాడ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం మండల స్థాయి అధికారులతో యోగా నిర్వహించారు. ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పీడీలు తదితరులు యోగాసనాలు వేశారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్‌తో బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేయడం తప్పనిసరి అని గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. పోస్టల్ శాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమ చేయటం జరుగుతుందన్నారు. దీనికి ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్ కార్డుకు బ్యాంకు ఖాతాను మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. పోస్టల్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ 5వ తేదీలోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఖాతాలను ఎన్‌పీసీఐకు అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

రేషన్ షాపుల్లో తూనికలు, కొలతల తనిఖీ

పెడన రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్న నేపథ్యంలో తూనికలు, కొలతలను తనిఖీ చేస్తున్నట్లు తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. మండల పట్టణ పరిధిలో 47 రేషన్ దుకాణాలు ఉన్నాయన్నారు. ప్రతి డీలర్ తమ వద్ద ఉన్న కాటాను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువస్తే తూనికల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వరరావుతో చెక్ చేయిస్తున్నామన్నారు. కాటాలను పరిశీలించి బ్యాటరీ, యాప్ అప్‌లోడ్ చేసి పంపుతున్నామన్నారు. ఆర్ఐ విజయలక్ష్మి వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.



గంజాయి నిందితులను మీడియాకు చూపుతున్న ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు

ఏడుగురి అరెస్టు, గంజాయి స్వాధీనం

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : బలరామునిపేట వద్ద గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని అరెస్టు చేసి నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఇనకుదురుపేట సీఐ పరమేశ్వరరావు ఆర్‌పేట పోలీసు స్టేషన్‌లో గురువారం విలేకరులకు తెలిపారు. భూపతి వినూత్న సాయి, జోగి సాయి శ్రీనివాస్, యర్రంశెట్టి కేశవ నాగకుమార్, మల్లిపూడి వినయ్, పుప్పాల స్వామి, వెన్నా అనిల్‌కుమార్, చిట్టిబొమ్మ గీత కృష్ణలను ఇటుకల బట్టీ వద్ద అరెస్టు చేసి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ పరమేశ్వరరావు మాట్లాడుతూ, గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ఎక్కడైనా గంజాయి అమ్ముతున్నట్టు తెలిస్తే పోలీసులకు వెంటనే తెలియచేయాలన్నారు.

పత్తాలేని సచివాలయ సిబ్బంది!



గురువారం 11-30 గంటలకు కూడా తెరచుకోని నెం.36 సచివాలయం

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో నెంబరు.36 సచివాలయాన్ని గురువారం మధ్యాహ్నం 11.30 గంటల వరకు తెరవలేదు. వివిధ పనులు మీద సచివాలయానికి వచ్చే ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆంధ్రజాతీయ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఈ సచివాలయానికి స్లమ్ ఏరియా ప్రజలు వస్తారు. రేషన్‌కార్డులు, ధృవీకరణ పత్రాలు, తదితర పనులు మీద వచ్చే ప్రజలు సరైన సమయంలో సచివాలయం తెరవక పోవడంతో ఎండకు తట్టు కోలేక వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. కొందరు సచివాలయ కార్యదర్శులు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారు. దీనిపై సచివాలయ అడ్మిన్ రాజేష్‌ను వివరణ కోరగా సచివాలయం తాళం వేరే వారి వద్ద ఉండిపోవడంతో సకాలంలో సచివాలయం తెరవలేకపోయామని తెలిపారు.



స్విమ్మింగ్ పూల్ వద్ద యోగా శిక్షణ, సూర్యనమస్కారాలు చేస్తున్న కలెక్టర్ బాలాజీ



బందరు నగరంలో గోడలపై యోగాంధ్ర పెయింటింగ్ వేస్తున్న కళాకారులు, నగరపాలక సంస్థ కార్యాలయంలో యోగా శిక్షణలో ఉద్యోగులు

యోగాతో ఆరోగ్యవంతమైన సమాజం

• కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధనతో ఆరోగ్యవంతమైన సమాజం నెలకొల్పుదామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ఉదయపు నడక మిత్ర మండలి హాలులో గురువారం కలెక్టర్ బాలాజీ యోగా కార్యక్రమంలో పాల్గొని సూర్యనమస్కారాలు చేశారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అందరికీ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. స్విమ్మింగ్ పూల్ వద్ద యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఝాన్సీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా శిక్షణలో యోగా మాస్టర్ శీలం రమేష్ శిక్షణా తరగతులు నిర్వహించారు. కబడ్డీ కోచ్ కల్యాణి, జిమ్ ట్రైనర్ అయ్యప్ప, స్విమ్మింగ్ కోచ్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయం సమావేశపు హాలులో గురువారం ఉదయం యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతులను కమిషనర్ బాపిరాజు ప్రారంభించి ప్రసంగించారు. యోగాంధ్ర యాప్‌లో నగరంలోని ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోవాలన్నారు. యోగా మాస్టర్లు మద్దాల చింతయ్య, అయ్యప్ప, ప్రసాద్, కుముద్వని తదితరులు మాట్లాడారు.

మునిసిపల్ కార్యాలయం గోడలపై యోగా పెయింటింగ్

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ గోడలపై యోగా పెయింటింగ్స్ వేయిస్తున్నారు. యోగాంధ్ర కార్యక్రమాలపై ప్రజలను చైతన్యపరిచేందుకు పెయింటింగ్స్ వేయిస్తున్నట్టు కమిషనర్ గోపాలరావు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

చల్లపల్లి : చల్లపల్లి, లక్ష్మీపురం, మాజేరు, మంగళాపురం సచివాలయాల ఉద్యోగులకు మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ నిర్వహించారు. మంగళాపురం జడ్పీహైస్కూల్ పీఈటీ శ్రీరామకృష్ణప్రసాద్, యోగా గురువు ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లాస్థాయి మానిటరింగ్ అధికారిణి ఎంఎస్.శేషప్రసన్న, నాగరాజు సచివాలయ ఉద్యోగులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగాసనాలు వేయించి వాటి ప్రాముఖ్యత వివరించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో వి. రవిశంకర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ యోగా ఆచరించేలా చూడాలని రవిశంకర్ కోరారు.

ఘంటసాలపాలెంలో..

ఘంటసాల : ఘంటసాలపాలెంలో గురువారం యోగా శిక్షణ ఇచ్చారు. యోగా మాస్టర్లు శేషగిరిరావు, మారుతి ఘంటసాలపాలెం, కొడాలి, చిట్టూర్పు సచివాలయాల ఉద్యోగులకు యోగా శిక్షణ ఇచ్చారు. యోగాసనాలు వేయించారు. సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు సూచించారు. పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో యోగా శిక్షణ ఇస్తున్న ప్రసన్న, నాగరాజు, ఆసనాలు వేస్తున్న సచివాలయ ఉద్యోగులు



ఘంటసాలపాలెంలో యోగా శిక్షణలో సచివాలయ సిబ్బంది



గోవర్ధన్ నేతృత్వంలో మహానాడుకు టీడీపీ శ్రేణులు

అవనిగడ్డ, మే 29 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న మహానాడుకు నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు బొబ్బా గోవర్ధన్ నేతృత్వంలో భారీగా తరలి వెళ్లారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 10 బస్సులలో 500 మంది కార్యకర్తలు బుధవారం రాత్రి తరలివెళ్లారు. దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు బండే శ్రీనివాసరావు, కర్రా సుధాకర్, నిడమానూరి దిలీప్‌కుమార్, పరిశె చలపతి తదితరులు బొబ్బా గోవర్ధన్ పార్టీ కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. మేడికొండ విజయ్, కోట సాయి, మేడికొండ విజయ్, ముప్పరాజు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నారద మహర్షి పాత్రికేయులకు ఆదర్శం : వీసీ రాంజీ



మాట్లాడుతున్న వీసీ రాంజీ

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : త్రిలోక సంచారి నారద మహర్షి యువ పాత్రికేయులకు ఆదర్శమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ అన్నారు. సాహితీ సుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి మహతి కళా వేదికపై దేవర్షి నారద జయంతి కార్యక్రమంలో ఉపకులపతి రాంజీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పెడన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాళ్లకూరి చంద్రశేఖర్, హిందూ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి, కావవరపు చంద్రశేఖర్, జి.కిషోర్‌కుమార్, శ్రీహరి, డాక్టర్ బి. ధన్వంతరీ ఆచార్య, పెద్దిరాజు, భవిష్య తదితరులు పాల్గొన్నారు. నగరంలోని పాత్రికేయులను ఉపకులపతి కూన రాంజీ ఘనంగా సత్కరించారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి



డ్రోన్ కెమెరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికత పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. వేకనూరులో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ సభ గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు అందిస్తోందన్నారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోహర్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సుధారాణి, ఎంపీడీవో మరియదేవి, గ్రామసర్పంచ్ తుంగల లక్ష్మీ, ఏడీఏ జయప్రద, ఉద్యానవన శాఖ అధికారి ఎన్.రమేష్, ఏవో వి.శౌరమ్మ, శాస్త్రవేత్తలు మంజువాణి, రేవతి, పంచాయతీ కార్యదర్శి రోహిత్, టీసీ అధ్యక్షులు భోగాది రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ నాగేంద్రరావు

మోపిదేవి, మే 29 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఖరీఫ్ సాగుపై గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్రరావు విత్తనాల ఎంపిక, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం అంశాలు క్షుణ్ణంగా వివరించారు. పండించిన పంటకు మద్దతు ధర లేక రైతులు నష్టాల పాలవుతున్నారని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సర్పంచ్ తుమ్మా సోములమ్మ, ఏవో హెబ్సిబా రాణి, పెదవేగి శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బన్న, మోపిదేవి, పెదప్రోలు, పెదకళ్లేపల్లి, వెంకటాపురం రైతులు సదస్సులో పాల్గొన్నారు.

ఉరువులమ్మ జాతర రేపు

అవనిగడ్డ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : బర్రంకుల గ్రామంలో ఉరువులమ్మజాతర ఈ నెల 31, జూన్ 1 తేదీలో జరుగుతుంది. మొదటి రోజున ఉరువులమ్మ తల్లిని గ్రామంలో ఊరేగించి, రెండో రోజున సంబరం, అన్నదానం చేస్తారు.




విద్యార్థులు ఆత్మస్థైర్యంతో సాగాలి

సబ్ జైలు సూపరింటెండెంట్ పి.రమేష్‌ను సత్కరిస్తున్న గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు భయాన్ని వీడీ, ధైర్యంగా లక్ష్యాలను సాధించాలని సబ్ జైలు సూపరింటెండెంట్ పి.రమేష్ అన్నారు. ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం ఎంత తగ్గిస్తే అంత మంచిదన్నారు. జీవితంలో పైకి రావాలంటే కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలన్నారు. సబ్ జైలు సూపరింటెండెంట్ రమేష్‌ను గ్రంథాలయ నిర్వాహకురాలు కోన వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు కాగిత సాంబశివరావు, శేషగిరిరావు, లాల్‌బహదూర్‌శాస్త్రి, కేశవ, తూము రవీంద్ర సత్కరించారు.

ఉపాధి హామీ కూలీ మృతి



మృతురాలు గాజుల లక్ష్మి

అవనిగడ్డ రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మోదుమూడికి చెందిన గాజుల లక్ష్మి (45) గురువారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లి అస్వస్థతకు గురైంది. దీంతో ఇంటికి వెళ్లగా, కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇవ్వటంతో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మి మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పేదల వైద్యానికి ప్రాధాన్యం : మండలి

అవనిగడ్డ, మే 29 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం నిరుపేదల వైద్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద 75 మంది లబ్ధిదారులకు రూ.36,02,122 విలువైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన

కోడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : పాలకాయితిప్ప గ్రామంలో మత్స్యకారులకు మత్స్య శాఖ సహాయ సంచాలకులు సోమశేఖరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలకాయితిప్ప తుఫాన్ షెల్టర్‌లో మత్స్యకారులకు, మత్స్య సంఘం సభ్యులకు వేట నిషేధిత సమయంలో బోట్ల మరమ్మతులు, వలల మరమ్మతులపై అవగాహన కల్పించారు.. మత్స్య సంఘ అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేశారు. మత్స్య సహాయకులు నరేంద్ర, సిహెచ్.మోషే, చెన్ను నాగరాజు, మెరైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి శనగల అభిషేకం

నాగాయలంక, మే 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదీ తీరాన వేంచేసి ఉన్న గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం పరమేశ్వరుని జన్మనక్షత్రం (ఆర్ద్ర) సందర్భంగా రామలింగేశ్వరస్వామికి 108 కేజీల శనగలతో ఆలయ అర్చకులు కౌశిక్ ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. భక్తులు విరివిగా వచ్చి తిలకించారు. శ్రీరామపాద క్షేత్రం ఆలయ కమిటీ ఛైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, సభ్యులు పర్యవేక్షించారు.



బొమ్మసాని గోపాలరావుకు టీడీపీ నేతల నివాళి

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం నెలకుర్రులో టీడీపీ నాయకుడు బొమ్మసాని గోపాలరావు సంతాప సభ గురువారం జరిగింది. టీడీపీ బందరు రూరల్ మండల నూతన అధ్యక్షుడు కాగిత గోపాలరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ కుంచే నాని, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ తదితరులు పాల్గొని గోపాలరావు చిత్రపటానికి నివాళులర్పించారు.



మన్యం పశుపతి హోమం

పెడన, మే 29 (ఆంధ్రజ్యోతి) : హనుమజ్జయంతి ఉత్సవాలలో భాగంగా తోటమూల సెంటర్‌లో గల అభయాంజనేయ స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం గురువారం మన్యం పాశుపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మచిలీపట్నానికి చెందిన జొన్నల వెంకటదుర్గాప్రసాద్ దంపతులు హోమాన్ని నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. పెడన పట్టణం, పరిసర గ్రామాల నుంచి ఆరువేలకు పైగా భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

విజయ అమలేశ్వరి పుట్టప్రవేశం

పెడన రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : దావోజిపాలెంలోని విజయ అమలేశ్వరీ దేవికి గురువారం పుట్టప్రవేశం, గజాలల కొలువు, జాగరణ భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంకెం వారి వంశీయులు, ఆడపడుచులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు.

నవగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : దొంతులమ్మ అమ్మవారి ఆలయంలో నవగ్రహ ప్రతిష్ఠకు గురువారం ఏర్పాట్లు చేశారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అగ్నిప్రతిష్ఠ వేదపండితులు లొల్లా కుటుంబశాస్త్రి నిర్వహించారు. 31న నవగ్రహ ప్రతిష్ఠ జరుగుతుంది.

చలో వరంగల్ జూన్ 21న : జయరాజు

మచిలీపట్నం టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ అవార్డు అందుకున్న మంద కృష్ణ మాదిగ జూన్ 21న వరంగల్ వస్తున్న నేపథ్యంలో చలో వరంగల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు సిద్దెల జయరాజు మాదిగ తెలిపారు. బందరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్‌కు ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు.